**పత్రికాప్రకటన** **కాకినాడ, ఆగస్టు 19 , 2019.**

--స్పందన ప్రతి సమస్య పై ప్రత్యేక శ్రద్ధ.

--అర్జీలు స్వీకరించిన జిల్లా కలక్టరు, మరో ముగ్గురు జిల్లా స్థాయి అధికారులు.

--స్పందన కు పెరుగుతున్న అర్జీదారులు.

-- జిల్లా కలక్టర్ డి.మురళీధర్ రెడ్డి

స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అర్జదారుల నుండి వచ్చే ప్రతీ సమస్యకు పరిష్కార దిశలో జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. సోమవారంనాడు కాకినాడ కలక్టరేట్ లో జరిగిన స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సుమారు ఐదు వేల అర్జీలు, ఫిర్యాదులు రాగా జిల్లా కలక్టర్ మురళీధర్ రెడ్డి, జేసి-2 జి.రాజకుమారి, డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు, బిసి కార్పొరేషన్ ఇడి ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి వాటిని స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిష్కారం నిమిత్తం అందజేసారు. వీటిలో మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి గృహాలు, పెన్షన్లకు 3,500 అర్జీలు, అదే విధంగా రెవెన్యూకు 589, డిఆర్.డి.ఏ పింఛన్లు 72, రూరల్ హౌస్ సైట్స్ 500, రేషన్ కార్డులు 65, ప్రజాసాధికార సర్వే 82, పట్టణ హౌస్ సైట్స్ 350 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా కలక్టరు డి.మురళిధర్ రెడ్డి మాట్లాడుతూ వచ్చిన ప్రతీ అర్జీ పై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఆ సమస్య పరిష్కార దిశలో చర్యలు చేపడుతున్నారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి అర్జీదారులు హాజరై తమ సమస్యలు, వినతులను జిల్లా కలక్టర్ కు విన్నవించారు.

సఖినేటిపల్లి మండలం అంతర్వేది ప్రకాష్ నగర్ కు చెందిన కొల్లాబత్తుల రామకృష్ణ, యాళ్ళ నాగేశ్వరరావు, తోట రాజబాబు, జిల్లేల్ల కిరణ్, సుధిర్ తదితరులు తమ గ్రామంలో అక్రమ ఉప్పునీటి చెరువులు త్రవ్వి ఆక్వా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, జన నివాసాలు, మంచినీటి చెరువులు, పంట కాలువలు, మద్యలో సాగు చేయడం వలన పర్యావరణం పాడవుతుందని, అనేక అంటు వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలు పాలవుతున్నారని కలక్టరుకు ఫిర్యాదు చేయగా, మత్స్యశాఖ జేడిని పర్యటించి పరిశీలించి వెంటనే నిలుపుదల చేయాలని ఆదేశాలు జారీ చేసారు. కాకినాడకు చెందిన కొల్లపూడి వెంకట శ్రీనివాస్, నానిపల్లి శివరామకృష్ణ, రామచంద్రపురం, అనిశెట్టి శివశ్రీ తదితరులు కాకినాడకు చెందిన ప్రతిపాటి శ్రీనివాస్ వడ్డీ వ్యాపారి వద్ద రుణం తీసుకొన్నామని అధిక వడ్డీ వసూలు చేసి బాధపెడుతున్నారని, న్యాయం చేయాలని కలక్టరుకు ఫిర్యాదు చేయగా, కాకినాడ అర్బన్ తహాసిల్దారును విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని, అదే విధంగా పోలీసు సూపరింటెండేంట్ ను పరిశీలించి

అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండపేట అంధుల పాఠశాల స్పెషల్ ఎయిడెడ్ మరియు వసతి గృహానికి చెందిన విద్యార్థులు బెల్లంకొండ బాల మురళీకృష్ణ, దూడల హరికృష్ణ, ఉప్పలూరి తేజ, పాఠశాల పాఠాలు వినడానికి, చదవడానికి ఉపయోగపడే డైజి ప్లేయర్ విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా మంజూరు చేయాలని కలక్టరుకు విన్నవించగా, కలక్టరు మురళీధర్ రెడ్డి స్పందించి, విభిన్న ప్రతిభావంతుల శాఖ ద్వారా 6,900 రూపాయలు విలువ చేసే యం.పి.-3 ప్లేయర్, రేడియో కమ్ వాయిస్ రికార్డర్ లు వారికి అందజేసారు. కాకినాడ ఎ.ఎం.జి. పాఠశాల సమీపంలో గల చుక్కా మురళీకృష్ణ, తన భార్య ఇరవురు వికలాంగులమని, రెండు కాళ్ళూ పని చేయవని, తన ఇద్దరు పిల్లలు వికలాంగులని ఆర్థిక సహాయం, ఇళ్ళు మంజూరు చేయాలని, కలక్టర్ కు విన్నవించగా, విభిన్న ప్రతభావంతుల శాఖ ద్వారా ట్రైసైకిళ్ళు ఇవ్వాలని, అదే విధంగా బి.సి. కార్పొరేషన్ ద్వారా ఇరువురు ఒక యూనిట్ గా రుణం మంజూరు చేయాలని, గృహం మంజూరుకు చర్యలు చేపట్టాలని కాకినాడ మున్సిపల్ కమీషనరుకు కలక్టరు ఆదేశించారు.

కాకినాడ జగన్నాధపురం యం.యస్.యన్.ఛార్టీస్ కు చెందిన ముమ్మిడి సత్యవతి కలక్టరుకు తమ సమస్య నిమిత్తం అర్జీ ఇవ్వడానికి కలక్టరేట్ కు వచ్చి లైనులో నిలబడి పడిపోయినందున కాలునొప్పి పట్టిందని ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందించాలని డిఎంహెచ్ఓను ఆదేశించారు. అదే విధంగా మీ సమస్య ఏమైనప్పటికి దానిని సత్వరం పరిష్కరిస్తామని కలక్టరు ఆమెకు భరోసా ఇచ్చారు. సామర్లకోట-పెద్దాపురం ఎడిబి రోడ్డు కు ఆనుకొని ఎపిఐఐసి కి చెందిన 850 ఎకరాల ఖాళీ స్థలం ఉందని దానిని పేద వారికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయవల్సినదిగా సామాజిక కార్యకర్త పుట్టా సోమన్న చౌదరి కలక్టరుకు ఫిర్యాదు చేయగా, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ ను సమగ్ర విచారణ జరిపి ఖాళీగా ఉండటానికి గల కారణాలు తెలియజేయాలని కలక్టరు ఆదేశించారు. పిఠాపురం రాజా కుమారుడు రామరత్నారావు తమ్మవరం గ్రామంలో తనకు గల 1.05 సెంట్లు భుమి సర్వే నెం. 239/4 లో ఉందని, దానిని కొత్తపల్లి మండలం పెదకలవల దొడ్డికి చెందిన కొప్పిశెట్టి నెరెళ్లు కబ్జా చేసారని కలక్టరుకు ఫిర్యాదు చేయగా, కాకినాడ రూరల్ తహాశిల్దార్ ను విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అల్లవరం మండలం గోడిగ్రామానికి చెందిన దెందుకూరు సత్యనారాయణ రాజు సర్వే నెం.69/4ఇలో 91 సెంట్లు, 16 సెంట్లు, 60 సెంట్లలో ఉప్పునీటి రొయ్యల సాగు చేస్తుండగా గ్రామస్తులు ఫిర్యాదు మేరకు రొయ్యల సాగు నిలుపుదల చేయాలని ఆదేశాలు ఇచ్చారని గోదావరి వైనతీయ నది నీరు ప్రకృతి సేద్యానికి ఇవ్వాలని కలక్టరుకు అర్జీని అందజేయగా, సంబంధిత తహాశిల్దారుకు విచారణ జరపాలని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆదేశించారు.

జిల్లాలో ఎక్సైజ్ శాఖ లో రిటైర్ అవుట్ లెట్ లో సేల్స్ సూపర్ వైజర్స్, సేల్స్ మెన్ నియామకాల్లో ఎస్.సి., ఎస్.టి.లకు తగిన అవకాశాలు కల్పించాలని ఎస్.సి.,/ఎస్.టి. విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సెల్ సభ్యులు గుడాల కృష్ణ, సబ్బతి ఫణీశ్వరరావు, తదితరులు కలక్టరుకు వినతిపత్రం అందజేయగా, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమీషనర్ ను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డి.ఎస్.సి.-2018 ఎస్.జి.టి. తెలుగు పండిట్ అభ్యర్ధులు మెరిట్ జాబితా ఈ సంవత్సరం ఫిబ్రవరి 15వ తేదీన రిలీజ్ చేసి ఆరు నెలలు గడిచినా భర్తీ ప్రక్రియలో ఎటువంటి కదలిక లేదని త్వరగా పరిష్కరించాలని కలక్టరుకు విన్నవించకోగా డిఇఓను పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాకినాడకు చెందిన సమాధాన పాలెపు సుర్యారావు వయో వృద్ధుడనని గుండె ఆపరేషన్ చేయించుకున్నానని 2.050 సెంట్ల భూమి డాక్యుమెంట్స్ కుమారుడు తీసుకొని ఇంట్లో నుంచి తరిమేసాడని జేసి-2కు ఫిర్యాదు చేయగా సంబంధికత ఆర్.డి.ఓ.ను విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. కోటనందూరు మండలం బొద్దవరం కు చెందిన ఇందుగపల్లి ఎరుకులమ్మ తన భర్త కిడ్నీ వ్యాధి,తో బాధపడుచున్నాడని, వైద్యం నిమిత్తం డయాలిసిస్ చేయించుకొనుటకు పెన్షన్ మంజూరు చేయవల్సినదిగా జేసి-2కి అర్జీని అందజేయగా, డిఎంహెచ్ఓను తగు చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

( సమాచార శాఖ చే జారీ )